Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

8 Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 180 | Thusday : 26.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :180 | గురువారం 26 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4


WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్: 9440815774



## సెప్టెంబర్ 30వ తేదీలోపు

# ఎన్నికలు నిర్వహించాలి

- సర్పంచ్' ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- ఇక, రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే
- గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం
- వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు
- వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి
- లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్:**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల(సర్పంచ్) నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మాధవి బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను సైతం పరిగణలోకి తీసుకున్నట్టు ధర్మాసనం తెలిపింది. అందులో భాగంగానే మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఇక, రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై గత కొన్నాళ్లుగా వాదనలు కొనసాగుతున్నాయి. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు - మిగతా3లో



## ఇక ఏడాదికి రెండుసార్లు పదో తరగతి పరీక్షలు

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఏడాది నుంచి రెండుసార్లు పది పరీక్షలు నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్
- రెండో విడత పదో తరగతి పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది

# జగన్‌లాంటి అడ్డగోలు సీఎంను ఎన్నడూ చూడలేదు



- ఐదేళ్లలో చేయకూడని అకృత్యాలు ఎన్నెన్నో చేశారు..
- రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేసి వెళ్లారు
- పాలన ఎలా ఉండకూడదో ఎమర్జెన్సీ ఓ కేస్ స్టడీ..
- పాలకులు ఎలా ఉండకూడదో జగన్ ఓ కేస్ స్టడీ
- పవన్, మోదీ, నేను కలిశాం.. చెడుపై విజయాన్ని సాధించాం..
- 'సంవిధాన్ హత్య దివ్‌స'లో సీఎం
- రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేసి వెళ్లారు: సీఎం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

"నా జీవితంలో జగన్ లాంటి అడ్డగోలు ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు." అని సీఎం చంద్రబాబు అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేసి పెట్టారని నిప్పులు చెరిగారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన 'సంవిధాన్ హత్య దివస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పాలన ఎలా ఉండకూడదో నాటి ఎమర్జెన్సీ ఒక కేస్ స్టడీ. పాలకులు ఎలా ఉండకూడదో 2019-24లో రాష్ట్రంలోని పాలకులు(వైసీపీ) ఒక కేస్ స్టడీ. చెడు చేసిన వారిని తరిమి కొట్టడమే నిజమైన ప్రజాస్వామ్యం.

ఉమ్మడి ఏపీలో నేను 9 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశా. నా రాజకీయ జీవితంలో చాలామంది ముఖ్యమంత్రులను చూశా. కానీ, 2019-24 మధ్య చూసిన ముఖ్యమంత్రి వేరుఒక ముఖ్యమంత్రి ఇలా కూడా చేయగలుగుతాడా అని ఆశ్చర్యం వేసింది. ఐదేళ్లపాటు అన్యాయాలు, అక్రమాలు, . - మిగతా3లో



## ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'.. కేంద్ర క్యాబినెట్

- శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ ఆమోదం
- పుణె మెట్రో రైలు విస్తరణకు ఆమోదం

# ప్రజలు మనపై బాధ్యత పెట్టారు, జాగ్రత్తగా పని చేయాలి

- మచిలీపట్నం అంటే టీడీపీ, టీడీపీ అంటేనే మచిలీపట్నం
- పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని జులై 2 నుంచి ఇంటింటికీ తీసుకెళ్లాలి
- ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం
- వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు
- మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలు మనమైన ఎంతో నమ్మకంతో ప్రజలు మనపై బాధ్యత పెట్టారని, కష్టపడి ప్రజాసమస్యలు పరిష్కరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నేతలతో మంత్రి నారా లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నం అంటే తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ అంటేనే మచిలీపట్నం. ఇక్కడ ఎప్పుడైతే గెలిచామో అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధించాం. మంత్రి కొల్లు రవీంద్రపై గత ప్రభుత్వంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టి వేధించినా టీడీపీ కోసం, చంద్రబాబునాయుడు గారికోసం నిలబడ్డారు. మచిలీపట్నంలో అక్రమ కేసులతో ఎంత వేధించినా పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొని విజయాన్ని సాధించి పెట్టిన కార్యకర్తలకు నమస్కారాలు. నేను ఈ రోజు మచిలీపట్నం వస్తుంటే అడుగడుగునా పోలీసులు ఉన్నారు. - మిగతా3లో



## మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదు

- శ్రీధర్‌బాబు ఆవేదన
- కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూముల అంశంపై చర్చలు
- హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం
- ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ముగ్గురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, పీయూష్ గోయల్, శ్రీపాద యశోనాయక్‌లను కలిసిన శ్రీధర్‌బాబు.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన - మిగతా3లో



## ఖర్గే చురకలు.. శశిథరూర్ కౌంటర్!

- నాకు ఇంగ్లీష్ చదవడం అంత బాగా రాదు
- కానీ, శశిథరూర్ భాష చాలా బాగుంటుంది.
- భారత సైన్యానికి మద్దతుగా విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి

# ఎమర్జెన్సీకి 50 ఏళ్లు.. దేశ చరిత్రలో చీకటి రోజు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25**

భారతదేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయిందని దేశ చరిత్రలో ఎమర్జెన్సీ అన్నది చీకటి రోజులని బిజెపి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్ పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ వడ్డీపల్లి బీసీ హాస్టల్ విద్యార్థులకు ఎమర్జెన్సీనాటి పరిస్థితులను బిజెపి నేతలు వివరించారు. భావ ప్రకటనా స్వేచ్ఛని రద్దు చేసి,ప్రతిపక్షాలు, ఉద్యమకారులను స్టెరిలైజేషన్ నుంచి జైలు శిక్ష వరకు అనేక ఇబ్బందులను ఎదుర్కోనిచేశారు. అప్పుడు జరిగిన పరిస్థితులను, ఇబ్బందులను కూర్చి 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని తీసు కువస్తున్నట్లు ప్రధాని మోడీ తాజాగా ప్రకటించిన విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి మండలపార్టీ అధ్యక్షులు వడివేలుతో పాటుపలు పాల్గొన్నారు.

### మండల పరిసర ప్రాంతాల్లో మొక్కలపై

# అవగాహన కల్పించిన కాలేజ్ విద్యార్థులు

**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**



పి.కొత్తకోటలో ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజికి సంబంధించిన బీటెక్ విద్యార్థులు, వారి చైర్మన్ సహాయంతో సిఎస్ఈ డిపార్ట్మెంట్‌కి పి నిర్మల అభిప్రాయాలు తీసుకొని వాళ్ళ మొక్కలు నాటుదాం-భూమిని రక్షిద్దాం అంటూ వివిధ ప్రాంతాలతో మొక్కలు నాటడం జరిగింది. మొత్తం 2 వారాలపాటు వాళ్ళ మొక్కలు నాటి వాటిని రక్షించారు. ఇంకా గ్రామాలతో ఇంటర్నెట్ వినియోగం గ్రామాభివృద్ధి అంటూ పల్లెప్రాంతాలకు వెళ్ళి, ఇంటర్నెట్ గురించి పిల్లలకు తెలియజేసివాళ్ళు జీవిత ఆశయాలను చేరుకోవని వాళ్ళకి మంచి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంకా యోగా-ఆరోగ్యానికి పునాది అంటూ విద్యార్థులకు మెగా ఆసనాల ప్రాముఖ్య తను పాఠశాలల దగ్గరకువెళ్ళి వివరించారు. దీనికి ఈ ప్రాజెక్టుకి చాలా సహాయపడ్డ వాళ్ళ ఇంచార్జ్ దీపలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా కే ఇంద్ర, బి వినోద, బి రమ్య, బీ భావన, ఈ కార్యక్రమంలో తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దపులి గంగమ్మ అభిషేక కార్యక్రమం





**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

వీకోట మండలం పాము గాని పల్లి పంచాయతీ గుమిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా వెలసిన పెద్దపల్లి గంగమ్మ మూల విరాట్‌కు భారీగా అభిషేకాలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో ఎన్నపల్లి గ్రామానికి చెందిన జయరామ్ గౌడ్ కుటుంబసభ్యుల చేత అమ్మవారికి భారీగా అభిషేకాలు చేయించి అనంతరం పుష్పాలంకరణ మరియు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని డోలు, మేళ, తాళాల వాయిద్యాలతో భారీగా ఊరేగింపు చేసినారు. ఈ సంద ర్భంగా ఆలయ ధర్మకర్త పురుషోత్తమ నాయుడు జయరామ్ గౌడ్ కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదాలు భారీగా వితరణ చేసినారు. ఈ కార్యక్రమానికి ఎర్నపల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు రూపు కుమార్ రాజు శంకర్ రెడ్డి కుమార్ రాజు,శ్యామ్‌రెడ్డి పవన్‌రెడ్డి జవహర్ భాష వెంకటరమణ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### టిడిపి సీనియర్ నాయకుడు

# లోకానాదంను పరామర్శించిన పైనేని మురళి

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**



ఎస్ఆర్ పురం మండలం ఎన్ ఆర్ పురం గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు లోకనాథం ఆరోగ్యం సరిగా లేక చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఈ సంఘటన తెలుసుకున్న ఎస్ఆర్ పురం మండల తెలుగుదేశం యువ నాయకుడు పైనేని మురళి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోకనాథంను పరామర్శించారు. ఆయన ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని ధైర్యంగాఉండాలని ఏ అవసరం వచ్చిన నాకు తెలియజేయాలని పైనేని మురళి తెలిపారు. అనంతరం లోకనాథంకు కొంత ఆర్థిక సహాయాన్ని పైనేని మురళి అందించారు.

# పాలీహౌస్ పరిశ్రమ ఏర్పాటు కోసం స్థల పరిశీలన



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పాలీ హౌస్ పరిశ్రమ ఏర్పాటు కోసంపాలి హౌస్ ఎండి ఇలంగో నారాయణన్ పరిశీలించారు. బుధవారం గంగాధర్ నెల్లూరు మండలం చిన్న వేపంజేరి బాల గంగనపల్లి, ఎస్ఆర్‌పురం పాతపాలెంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా పాలిహౌస్ ఎండి ఇలంగో నారాయణన్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ డాక్టర్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో చదువుకున్నయువ తీయువకులు చాలామంది పేదరికంలో ఉన్నారు. వాళ్ళకి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పురం తాసిల్దార్ లోకనాథం గంగాధర్ నెల్లూరు తాసిల్దార్ తులసీరామ్ సర్వే సునీత వీఆర్వో చంద్రబాబు, ఎమ్మెల్యే చంద్రశేఖర్, మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు సాఫ్ట్వేర్ బాలు, బాలా జీ నాయుడు గొల్ల పల్లి సుబ్రహ్మణ్యం నాయుడు నియోజక వర్గం ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ లోకేష్ దశరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపంజాణి తహసీల్దార్‌గా హనుమంతు నాయక్

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**



పెద్దపంజాణి మండల తహసీల్దార్‌గా హనుమంతు నాయక్ బుధవారం విధుల్లో చేరారు. పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలంలో పని చేస్తున్న ఈయన పెద్దపంజాణి మండలానికి బదిలీపై వచ్చారు.విధుల్లో చేరిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. రెవిన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఆయనతో పాటు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

# మామిడి ధర పతరానికి గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణం

## మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**


శ్రీకాళహస్తి ఏపీలోని మామిడి రైతాంగం గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసిపిప్రభుత్వం అమలు చేసిన విధానాలతో ఫ్యాక్టరీలు నష్టపోయాయి. కొన్నిచోట్ల నిర్వహణ భారంతో ఫ్యాక్టరీలు మూసివేయాల్సిన దుస్థితిఏర్పడింది. దీంతో ఈ ఏడాది రైతులకు న్యాయమైన ధరఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకచొరవ తీసుకుంది. రైతులకు ఆదుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కిలో తోతాపూరి మామిడికి 12 రూపాయలు గిట్టుబాటుధర కల్పిస్తూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు ప్రకటన చేశారు. అందులో ఎనిమిది రూపాయలు జ్యూస్ ఫ్యాక్టరీలు చెల్లించే విధంగా నాలుగు రూపాయలకు ప్రభుత్వంచెల్లించే విధంగా తెలిపారు. ప్రభుత్వం నాలుగు రూపా యలు భరించేందుకు ముందుకు వచ్చిన జ్యూస్ ఫ్యాక్టరీలుమాత్రం ప్రభుత్వం ప్రక టించిన ఎనిమిది రూపాయలు ఇచ్చేందు కు



వెనుకడుగు వేస్తున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో తీవ్రంగా నష్టపోయామని ఫ్యాక్టరీ యాజమాన్యం అంటోంది. దీంతో చాలాచోట్ల ఎనిమిది రూపాయలు ఇచ్చేందుకు ఫ్యాక్టరీలు ముందుకు రావడంలేదు. అయితే ప్రభుత్వంమాత్రం రైతులను ఆదుకునే ఫ్యాక్టరీ యజమాలను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి మామిడి ఏపీ ఫ్యాక్టరీలకు తరలించేందుకు నిషేధం విధించారు. అలాగే పలుసార్లు మామిడి గుజ్జు పరిశ్రమతో జిల్లా కలెక్టర్లు సంప్రదిం పులు జరుపుతున్నారు.తద్వారా రైతులు నష్టపోకుండా ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా చోట్ల రైతులు ఫ్యాక్టరీలకు మామిడి తరలించారు. అందులో నాణ్యమైన మామిడి ప్రభుత్వం చెప్పిన రేటు ఇచ్చేందుకు కొన్ని ఫ్యాక్టరీలు ముందుకు కూడా వస్తున్నాయి. ఇంకా మామిడి సీజన్ ఉండడంతో రైతులకు ఊరట కల్పించే ప్రయత్నం ప్రభుత్వం కొన సాగిస్తోంది ఇందులో భాగంగా ఫ్యాక్టరీలలో ప్రభుత్వ సిబ్బందితో కమిటీలు కూడా వేశారు. మామిడిలోడ్లకు టోకెన్లు సిస్టం అమలు చేస్తున్నారని తొట్టంబేడు మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు తెలిపారు.

# ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ...జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్





**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**

చిత్తూరుజిల్లాకు సంబంధించి ఈవీఎంల ను భద్రపరిచిన గోడౌన్ వద్దనిర్వహణపట్ల భద్రతా అంశాలపై ఉన్నతమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాలు మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్ ను బుధవారం రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రమరచిన ఈవీఎం యంత్రాలు, బి.యులు, సి.యులు, వివిప్యాట్‌లను, నలక్షణ భద్రతా అంశాలను మరియు సిసి కేమెరాల పని తీరును జిల్లాకలెక్టర్ క్లుప్తంగా పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులుగా టి.డి.పి సురేంద్ర కుమార్, బిజెపి అట్లూరి శ్రీనివా సులు,వైస్సార్ ఉదయం కుమార్, ఇండి యన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ పరదేశి,సి పి ఎం.గంగరాజు, జనసేన యశ్వంత్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, మనోజ్ కుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

### లా సెట్‌లో 1422 ర్యాంక్ తెచ్చుకున్న

# న్యూస్ రిపోర్టర్ కంగుంది శివకుమార్



**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన లా సెట్‌లో పలమనేరు పట్టణానికి చెందిన న్యూస్ రిపోర్టర్ కంగుంది శివకుమార్ 1422 ర్యాంక్ తెచ్చుకున్నాడు వృత్తిపరంగా న్యూస్ రిపోర్టర్ కావడం కష్టాల కొలిమిని దాటుకొని మీ ర్యాంకు తెచ్చుకోవడం పట్లసహచర న్యూస్ రిపోర్టర్లు హర్షంవ్యక్తం చేశారు. లా పూర్తి చేసి మంచి లాయర్ హెూదాలో ప్రజలకు సేవచేసే దృక్పథం శివకుమార్‌లో ఉందని కొనియాడారు. పలమనేర్ ప్రెస్ క్లబ్ తరపున ఆయన చదువుకు కావలసిన అవసరాలను తీర్చడానికి ఎల్లవేళల ముందు ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు ప్రెస్‌క్లబ్‌కు చెందిన రామాంజనేయులు 5000 రూపాయలు తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపి శివకుమార్‌ను అభినందించారు.

# ఒంగోలు అదనపు ఎస్పీకి ముక్కోటి తీర్థ ప్రసాదాలు అందజేసిన డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

శ్రీకాళహస్తి ప్రకాశంజిల్లా, ఒంగోలు అదనపు ఎస్పీ నాగేశ్వరరావుకు బుధవారం ప్రముఖసంఘ సేవకులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ స్టేట్ కౌన్సిల్‌సభ్యులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు ముక్కంటి ప్రసాదాలు అందచేశారు. ఒంగోలులోని కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావును కోటేశ్వరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్శనార్థం శ్రీకాళహస్తికి విచ్చేయాలని అదనపు ఎస్పీ నాగేశ్వరరావును కోరారు.

### నేటి నుంచి వైష్ణవిదేవి ఆలయంలో

# వారాహిదేవి నవరాత్రులు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**



చౌడేపల్లి మండలంలోని పుదీపట్ల లోగల స్వయంభు వైష్ణవిదేవి ఆలయంలో ఈనెల 26 నుంచిజూలై 4వరకు వారాహిదేవి నవ రాత్రులు జరుగుతాయని ఆలయనిర్మాణ కర్త ప్రధానఅర్చకురాలు వినోద్ కుమార్ రెడ్డి గ్రామీణలో తెలిపారు. బుధవారం ఆలయంలోవారు మాట్లాడుతూ ఆషాడ శుక్లపాడ్యమినుంచి ఈ కార్యక్రమం ఆలయంలో మొదలవుతుందన్నారు. నవరా త్రులు సందర్భంగా ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ తలుపులు తెరిచి ఉంటాయని ప్రత్యేక కాకుండా అభిషేకము మహా మంగళ హారతి తీర్థ ప్రసాద వినియోగము ఉంటుందన్నారు. భక్తాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన




**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

అన్నమయ్యజిల్లా పీలేరు పీఎం సూర్య పథకం పై పీలేరు డివిజన్ లో 10,000 మందికి అవగాహన కల్పిస్తున్నట్లు సిఎస్ ఆర్ డిగ్రీకళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. పీలేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పీఎం సూర్యఘర్ పథకం పై అవగాహన కల్పించారు. ఈ పథకము ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ ఓసీ వినియోగదారులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుంది అనే విష యంపై విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా ఈ పథకాన్ని విస్తృత స్థాయిలో ప్రచారాన్ని కల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, డివి ఎంసి సభ్యులు బోధి షావలి, విద్యుత్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో

# ప్రవేశాలకు గడువు పొడిగింపు




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు గడువు 30వ తేదీవరకుపొడిగించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ పుంగనూరులో ఉన్న కళాశాలలో అడ్మిషన్ల కొరకు డిప్లమా కోర్సులకు ఆన్లైన్ పద్ధతిలో విశ్వవిద్యాలయం వారు దరఖాస్తులను మే 28వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యు వెంకటేశ్వర్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇంటర్ ఫైల్ అయిన విద్యార్థులు డిప్లమాలో ప్రవేశం కొరకు అర్హులు, కోర్స్ కాలవ్యవధి రెండు సంవత్సరములు మరిన్ని వివరాలకు www.angrau.ac.in లేదా 9493253151, 9010402068. సంప్రదించాలని తెలియజేశారు.

# డిగ్రీకళాశాల ఏర్పాటు పై కమిటీ స్థల పరిశీలన.







**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**

కడపరీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ (ఎఫ్ఏసి) వారి ఆదేశాల మేరకు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కమిటీ వరదయ్యపాలెం సందర్శించారు. అర్జీదారు (ఎన్టీఆర్ వెంకయ్య) విజ్ఞప్తితో, ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో, రెండవసారి డిగ్రీ కాలేజ్ ఏర్పాటు కమిటీ వరదయ్యపాలెం రావడం విశేషం. శ్రీకాళహస్తి ఎస్‌విఏ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై నాగరాజు నాయుడు, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సుజాత, శ్రీకాళహస్తి ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే నరసింహ వర్మ కమిటీగా వరదయ్యపాలెం సందర్శించారు.ఈ క్రమంలో వరదయ్యపాలెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతితో కలసి స్థలం పరిశీలించారు. డిగ్రీ కళాశాలకుఅనుకూలంగా ఉన్నట్టు, నివేదికన ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్ న్యూస్ రిపోర్టర్ కతారి ప్రశాంత్‌తో పాటు పాల్గొన్నారు.

సోషల్ మీడియా స్నేహాలతో జాగ్రత్తగా ఉండండి

# పలమనేరు సిఐ నరసింహారాజు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**

ఆకర్షించే మాటలను నమ్మిమీవ్యక్తిగత వివరాలు చెప్పొద్దు. ఫోటోలు, వీడియోలు అస్సలు పంపించొద్దు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్‌తో సైబర్ మోసగాళ్లు మిమ్మల్ని ఆకర్షిస్తారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే రిక్వెస్టులను యాక్సెప్ట్ చేయొద్దు.

# జగన్‌లాంటి అడ్డగోలు సీఎంను ఎన్నడూ చూడలేదు

-మొదటిపేజీ తరువాయి

అవినీతి, ఎవరు గొంతు విప్పినా నులిమేయటం, కబ్జాలు, మోసాలు, బెదిరింపులు, దాడులు, ఆస్తులు రాయించుకోవటం వంటివి జరిగాయి. గత పాలన వల్ల చాలా నష్టపోయాం. నేనేమైనా ఫర్వాలేదు. నన్ను అభిమానించిన తెలుగు ప్రజానీకం కోసం తెలుగు రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న ఉద్దేశంతో రాజీలేకుండా పోరాడాం. ఇదే సమయంలో మిత్రుడు పవన్ కల్యాణ్ కూడా చాలా ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కాపాడుకోవాలని పవన్, నేను, నరేంద్ర మోదీ అందరం కలిసి ముందుకు వచ్చాం. అందరం కలిసి విధ్వంసం నుంచి ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలో వచ్చాం. తొలిఏడాదిలోనే సుపరిపాలనలో తొలి అడుగు వేశాం" అని చంద్రబాబు అన్నారు.



**ఓటే ఆయుధం**

"దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయింది. ఇప్పుడు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయింది. ఇన్ని దశాబ్దాల ప్రయాణంలో ఎన్నో మలుపులు, సవాళ్లు ఎదురయ్యాయి. విజయాలు సాధించాం. కానీ, ఎమర్జెన్సీ తర్వాత చీకటి నెలకొంది. ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం. గతం ఎప్పుడూ మరిచిపోకూడదు. మంచి రోజులే కాకుండా చీకటి రోజులను కూడా గుర్తుకు పెట్టుకుంటే ఏది మంచి, ఏది చెడో తెలుస్తుంది. ముఖ్యంగా రాజకీయాలలో, ప్రజాజీవితాలలో ఉండే మాపై ఎంతో బాధ్యత ఉంది." అని చంద్రబాబు చెప్పారు. "అహంభావం.. నాకు ఎదురు లేదన్న గర్వంతో ఆ రోజు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారు. పత్రికలపై సెన్సార్ పెట్టారు. జర్నలిస్టులను అరెస్టు చేశారు. రాజకీయాల్లో అహం భావం ఉండకూడదు. బలవంతంగా కుటుంబ నియంత్రణ చేపట్టారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా వనరులు పెరగవేమోనని నేను కూడా గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ పాటించమని చెప్పా. దీంతో పదేళ్ల పాటు జనాభా తగ్గింది. ఆ రోజున జనాభా కంట్రోల్‌లోకి వచ్చింది. కానీ, ఈ రోజు మళ్లీ తగ్గింది. అందుకే పిల్లల్ని కనమని చెబుతున్నా. ఇదే ప్రజాస్వామ్యం." అని చంద్రబాబు అన్నారు.

**అలా వెళ్లి.. ఇలా వచ్చేసరికి!**

"1984, ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు అమెరికా వెళ్లి తిరిగి వచ్చే సరికి మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నా ఆయన ప్రభుత్వాన్ని ఇందిరాగాంధీ భర్తరఫ్ చేయించారు. ప్రజాస్వామ్యవాదులు ఎన్టీఆర్‌తో కలిసి 30 రోజుల పాటు ప్రజా ఉద్యమం చేయడం ద్వారా ఇందిరాగాంధీ మెడలు వంచి మళ్లీ ముఖ్యమంత్రి కాగలిగారు. ఇదీ ప్రజాస్వామ్యం. కొంతమంది నాయకులు చెడు చేసినా.. అది తాత్కాలికం. అలాంటి వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు." అని చంద్రబాబు అన్నారు.

**జగన్ క్షిపణి రక్షణ కోరతారేమో!: సత్య**

వైసీపీ హయాంలో రాష్ట్రంలో ఐదేళ్లు అప్రకటిత ఎమర్జెన్సీ నడిచిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కేంద్రం చొరవతో కరోనాను రాష్ట్రం నుంచి ఆరు నెలల్లో పారదోలామని, కానీ, దానిని మించిన వైసీపీవైర్‌సను ఐదేళ్లు భరించామని విమర్శించారు. ఘోర ఓటమి తర్వాత కూడా వైసీపీ ఆత్మవిమర్శ చేసుకోకుండా పాత ధోరణిలోనే వ్యవహరిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌కి జెడ్ ప్లస్ భద్రత కల్పించినా.. భద్రతా వైఫల్యం ఉందని చెబుతున్నారని, ఆయనను ఇలాగే వదిలేస్తే తనకు ఎస్-400 క్షిపణులతో రక్షణ కల్పించమనే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, అధికార కాంక్షతోనే నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు

# ప్రజలు మనపై బాధ్యత పెట్టారు, జాగ్రత్తగా పని చేయాలి

-మొదటిపేజీ తరువాయి

మనపై అక్రమ కేసులు పెట్టిన వారే మనకు సెల్యూట్ కొట్టారంటే అదీ ప్రజాస్వామ్య గొప్పదనం. చంద్రబాబు గారి మొండిధైర్యం మామూలుది కాదు. 1996లో రాజమండ్రి సెంట్రల్ జైలును ఆధునీకరించిన వ్యక్తి. 2014-19 మధ్య చంద్రబాబు గారు కట్టిన బ్లాక్ లోనే ఆయనను అక్రమంగా నిర్బంధించారు. జైలు నుంచి చంద్రబాబునాయుడు గారు పులిలా బయటకు వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు మనకు సెల్యూట్ లు కొడతారు. పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు. పార్టీ కోసం కంటిచూపు పోగొట్టుకున్న చెన్నుపాటి గాంధీ, మంజులారెడ్డి, అంజిరెడ్డి తాత, తోట చంద్రయ్యలే మనకు ఆదర్శనం. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా వ్యవహరించాలి. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకుందాం. అంతర్గతంగా పోరాడాలి. జగన్ రెడ్డిపై కంటే మూడు రెట్లు ఎక్కువగా పార్టీలో పోరాడా. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలి.

**ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం**

దేశంలో ఏ పార్టీకి రానివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. ప్రజలకు మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పుకోవాలి. మెగా డీఎస్సీ ద్వారా 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. పెద్దఎత్తున కంపెనీలను తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది నిరుద్యోగ భృతి మొదలుపెడుతున్నాం. భూమి కన్నా ఎక్కువ భారం మోసేది మహిళ. వారిని గౌరవించాలనేది టీడీపీ నినాదం. మహిళలను గౌరవించాలనేది ముందు మన ఇంట్లో మొదలవ్వాలి. 50శాతం పనులు మగవారు, 50శాతం పనులు ఆడవారు చేయాలని పాఠ్యాంశాల్లో పెట్టాం. జులై 5న మెగా పేరెంట్స్-టీచర్ మీటింగ్ లో తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలి. ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. ఇప్పటి వరకు 2 కోట్ల సిలిండర్లు అందించాం. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సబ్సిడీ మొత్తాన్ని మహిళల అకౌంట్లలో జమచేస్తాం. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగ పెన్షన్ రూ.6వేలు, పూర్తిగా అంగవైకల్యం ఉన్నవారికి రూ.15వేలు పెన్షన్ అందిస్తున్నాం.

**కూటమి ప్రభుత్వ అభివృద్ధిని జులై 2 నుంచి ఇంటింటికీ తీసుకెళ్లాలి**

కూటమి ప్రభుత్వ అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లాలి. జులై 2 నుంచి సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోర్ టూ డోర్ ప్రచారం చేయాలి. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తాం. ఇకపై ప్రతి ఒక్కరు నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలి. కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నేను అది చూసుకుని వెళ్లకుండా ముందుగా కార్యకర్తలతో సమావేశం అయ్యాను. ఇకపై నేతలందరూ నియోజకవర్గ పర్యటనల్లో కార్యకర్తలతో భేటీ కావాలి.



**వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు**

వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ప్రతిపక్ష నేత ఇప్పటికీ ప్రజలను కలుసుకోవడం లేదు. కార్యకర్తలను కలవడం లేదు. రెడ్ బుక్ పేరు చెబితేనే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరికి బాత్ రూమ్ లో జారి చేయి విరిగింది. మేం చట్టప్రకారం ముందుకు వెళ్తున్నాం. పార్టీ నేతలు, కార్యకర్తలకు అహంకారం వద్దు. సౌమ్యంగా ఉండాలి. అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రజలు మనపై బాధ్యత పెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. కష్టపడి ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

**ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది**

ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్ర సహకారం వల్లే మనం ముందుకు వెళ్లగలుగుతున్నాం. ఏపీ అన్ని కోరికలను ప్రధాని నరేంద్ర మోదీ గారు తీరుస్తున్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో 3 లక్షల మంది యోగసనాలతో గిన్నిస్ బుక్ రికార్డ్ సృష్టించి మోదీ గారికి కానుకగా ఇచ్చాం. కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయి. కూటని బలోపేతం చేద్దాం. ప్రభుత్వం, పార్టీ జోడెద్దుల బండి. రెండింటినీ నడిపేందుకు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో కార్యకర్తలను గౌరవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జోనల్ ఇంఛార్జ్ మంతెన సత్యనారాయణ రాజు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, నియోజకవర్గ పరిశీలకులు ఎల్. సాయిరాం ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ బై పోల్ లో నందమూరి వారసురాలు

**హైదరాబాద్ :** తెలుగు రాజకీయాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. ఎన్టీఆర్ వారసులుగా నందమూరి హరికృష్ణతో పాటు బాలకృష్ణ రాజకీయం చేశారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. మరోవైపు టిడిపిలో క్రియాశీలకంగా అవుతామనుకున్న తరుణంలో నందమూరి తారకరత్న మృతి చెందారు. జూనియర్ ఎన్టీఆర్ తో పాటు కళ్యాణ్ రామ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కానీ వారి సోదరి సుహాసిని మాత్రం యాక్టివ్ గా ఉన్నారు. తెలంగాణలో జరిగే ఉప ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తారని ప్రచారం నడుస్తోంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇప్పటికే అన్ని పార్టీలు సన్నాహాలు ప్రారంభించాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీ సెంటిమెంట్ వస్త్రాలను బయటకు తీస్తోంది. మరోవైపు కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీట్లో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది.అనుకోని అవకాశంగా తెలుగుదేశం పార్టీభావిస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గెలిచిన మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీకి చెందినవారు. టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ లోకి ఫిరాయించారు. అందుకే ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి పోటీ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టిడిపికి మిత్రపక్షాలుగా ఉన్న బిజెపి, జనసేనతో తెలుగుదేశం పార్టీ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ అభ్యర్థిత్వంపై ఒక అంచనాకు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ స్థానానికి అక్టోబర్లో ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుంది. ఎలాగైనా ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. నియోజకవర్గంలో పరిస్థితుల అధ్యయనం, నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ తో కూడిన కమిటీని సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. 2009 పునర్విభజనతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడింది. 2014 నుంచి వరుసగా గెలుస్తూ వచ్చారు మాగంటి గోపీనాథ్. 2014లో టిడిపి నుంచి, 2018, 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఖైరతాబాద్ నుంచి విడిపోయి జూబ్లీహిల్స్ నియోజకవర్గం గా అవతరించింది. 2009లో మాత్రం కాంగ్రెస్ పార్టీ నుంచి విష్ణువర్ధన్ రెడ్డి గెలిచారు.ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి అజారుద్దీన్, పిజెఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ ముస్లిం మైనారిటీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ ఎంఐఎం మధ్య ఒప్పందం కుదిరితే మాత్రం ఇక్కడ సమీకరణలు మారడం ఖాయం. మరోవైపు గోపీనాథ్ కుటుంబం నుంచే బిఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేసే అవకాశం ఉంది. సాధ్యం కాకుంటే మాత్రం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి సీటు కేటాయించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే తెలుగుదేశం పార్టీ మాత్రం మిగతా రెండు మిత్రపక్షాలతో కలిపి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అటు మాగంటి గోపీనాథ్ చంద్రబాబుకు కావలసిన మనిషి. అందుకే ఆయన మరణ సమయంలో లోకేష్ ప్రత్యేకంగా పరామర్శించారు వారి కుటుంబ సభ్యులను. తెలంగాణలో టిడిపి విస్తరణ దిశగా చంద్రబాబు ప్లాన్ చేస్తున్నారు. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. అంతకుముందే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రూపంలో అవకాశం వచ్చింది.

## సెప్టెంబర్ 30వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాలి

-మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి.

**తెలంగాణ ప్రభుత్వం తరపున..**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

**ఈసీ, ప్రభుత్వ అభ్యర్థన..**

మొత్తంగా.. ఎన్నికల నిర్వహణకు నెల రోజుల గడువు ఇవ్వాలని ప్రభుత్వం కోరగా.. ఎన్నికల సంఘం 60 రోజులు గడువు కోరింది. వాదనలు విన్న ధర్మాసనం జూన్ 23వ తేదీన తీర్పును రిజర్వు చేసింది. ఇవాళ ఆ తీర్పును వెల్లడించింది. కాగా, 2024 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి తెలంగాణ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. దాంతో ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని నిబంధనను గుర్తు చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలైనా పెట్టండి.. లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించండి అని పిటిషనర్లు వాదనలు వినిపించారు. పిటిషనర్లలో కొంతమంది పౌరులతో పాటు ప్రజాప్రతినిధులు ఉన్నట్లు సమాచారం.

## చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీ పనులను పునరుద్ధరిస్తామని చెప్పారు. రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులని కేటాయించామని తెలిపారు. టన్నెల్ నిర్మాణంలో నిష్ణాతులైన వారి నియామకానికి కసరత్తు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన టన్నెల్ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా జులైలో చేరారని తెలిపారు. నీటిపారుదల శాఖ సలహా దారుడిగా జనరల్ హర్పల్ సింగ్‌కు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా జనరల్ హర్పల్ సింగ్ పనిచేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదు

-మొదటిపేజీ తరువాయి

భూముల అంశంపై చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2పై కేంద్రమంత్రివర్గం నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రధాని, కేంద్రమంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. మెట్రోపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం నిర్ణయం తీసుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో మెట్రోకు అనుమతి వస్తుందని భావించామన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## అదనపు కలెక్టర్లు వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించాలి

-మొదటిపేజీ తరువాయి

పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ తర్వాత జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందొచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కరసేవకుడి నుంచి కార్యసాధకుడి దాకా...

**కరీంనగర్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయంగా అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా గుర్తింపు పొందారు.బండి సంజయ్.. తెలంగాణలో రాజకీయాలపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన నేత. కరుడుగట్టిన హిందుత్వ వాది. హిందూ టైగర్‌గా కరీంనగర్ పట్టణ ప్రజలు, యువత పిలుచుకునే మాస్ లీడర్. సామాన్య కరసేవకుడిగా ప్రయాణం ప్రారంభించి.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఎదిగి. కార్య సాధకుడిగా గుర్తింపు పొందాడు. 30 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎట్టకేలకు సొంత ఇల్లు కొనుగోలు చేశాడు.కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయంగా అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా గుర్తింపు పొందారు. ఇటీవల ఆయన చైతన్యపురి కాలనీలో రూ.98 లక్షలతో ఇంటిని కొనుగోలు చేసి, రాజకీయ జీవంతోపాటు వ్యక్తిగత జీవితంలో కూడా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు.బండి సంజయ్ కరీంనగర్‌లో కార్పొరేటర్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచే రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. కానీ రెండుసార్లు ఎంపీగా విజయం సాధించారు. ఇటీవల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులై, ఆయన రాజకీయ ప్రభావం మరింత పెరిగింది. ఈ విజయాలన్నీ కరీంనగర్‌లోని అత్తగారి ఇంటి నుంచే సాధించడం విశేషం. ఈ నేపథ్యం ఆయన సామాన్యత, స్థానికులతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని తెలియజేస్తుంది.ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో సొంతిల్లు లేకపోవడం బండి సంజయ్ వ్యక్తిగత జీవితంలో ఒక విశిష్ట అంశం. అయితే, చైతన్యపురిలోని తన కార్యాలయం సమీపంలో రూ.98 లక్షలతో ఇంటిని కొనుగోలు చేయడం ద్వారా ఆయన ఈ లోటును భర్తీ చేశారు. ఈ ఇంటి కొనుగోలుకు ఆయన సతీమణి అపర్ణ పేరిట రూ.85 లక్షల బ్యాంకు రుణం తీసుకోవడం, ఆర్థిక ప్రణాళికలో వారి జాగ్రత్తను సూచిస్తుంది. సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకోవడం ఈ ప్రక్రియను పూర్తి చేసిందిబండి సంజయ్ సతీమణి అపర్ణ బ్యాంకు అధికారిగా పనిచేస్తూ, కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతున్నారు. రాజకీయ నాయకుడిగా ఉన్నప్పటికీ, అత్తగారి ఇంట్లో నివసించడం ద్వారా సంజయ్ సామాన్య జీవనశైలిని కొనసాగించారు. సొంతిల్లు కొనుగోలు చేసిన తర్వాత కూడా, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక బాధ్యతను స్వీకరించడం ఆయన ఆర్థిక సమతుల్యతను ప్రతిబింబిస్తుంది.సొంతిల్లు కొనుగోలు చేయడం బండి సంజయ్ జీవితంలో కేవలం ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదు, ఇది ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితంలో స్థిరత్వానికి సంకేతం. కరీంనగర్‌లోని చైతన్యపురిలో కార్యాలయం సమీపంలో ఇంటిని ఎంచుకోవడం, ఆయన స్థానికులతో సన్నిహితంగా ఉండాలనే సంకల్పాన్ని చాటుతుంది. కేంద్ర మంత్రిగా ఆయన కావాలనుకుంటే ఢిల్లీలో కూడా ఇంటిని కొనుగోలు చేయగలరు. హైదరాబాద్‌లో అయినా కొనుగోలు చేయవచ్చు. కానీ తాను పుట్టిన గడ్డకు, తనకు రాజకీయ భిక్ష పెట్టిన కరీంనగర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. స్థానికతకు పెద్దపీట వేశారు. ఈ నిర్ణయం ఆయన కుటుంబ జీవితంలో కొత్త దశను సూచిస్తూ, సామాన్య ప్రజలతో ఆయన అనుబంధాన్ని మరింత బలపరుస్తుంది.బండి సంజయ్ రాజకీయ జీవితంలో అనేక విజయాలు సాధించినప్పటికీ, సొంతిల్లు లేని నాయకుడిగా ఉండటం ఆయన సామాన్యతకు నిదర్శనం. చైతన్యపురిలో ఇంటి కొనుగోలు ఆయన వ్యక్తిగత జీవితంలో స్థిరత్వాన్ని, ఆర్థిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఈ నిర్ణయం ఆయన రాజకీయ, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యతను సాధించే ప్రయత్నంగా భావించవచ్చు. అదే సమయంలో కరీంనగర్ ప్రజలతో ఆయన అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది

## రేషన్ షాప్ డీలర్‌లతో తహసిల్దార్ సుధీర్ రెడ్డి సమావేశం

**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 25:**



ప్రజలకుఇబ్బంది లేకుండా నిత్యావసరకుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని తహసీల్దార్ సుధీర్ రెడ్డి సూచించారు. 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు దివ్యాంగులు, సీనియర్ సిటిజెన్‌లకు వారింటివద్దకే బియ్యం పంపిణీ చేయాలని, ప్రభుత్వం నిర్ణయంకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ తునిక యంత్రాలు సాంకేతికతలెత్తకుండా చూసు కోవాలని తహాశీల్దార్‌కు తెలిపారు. చెంచుకృష్ణయ్య, రవి, లోకనాదం, సోమసుందరం, బుజ్జమ్మ, బాబు, తదితర రేషన్ షాప్‌ల డీలర్‌లుపాల్గొన్నారు.

## అర్బన్, రూరల్ సీఐలను మర్యాదపూర్వకంగా కలసిన భారతీయ అంబేద్కర్ సేన నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**
కుప్పం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్‌ని, అర్బన్ సీఐని, అదేవిధంగా గుడిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారిని భారతీయ అంబేద్కర్ సేననాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ అంబేద్కర్‌సేన ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని వారికి బహుకరించడం జరిగింది. నియోజకవర్గంలో ఉన్నటువంటి దళిత సమస్యలు వారి దృష్టికి తీసుకోపోగా సిఐ, ఎస్సై సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి యం బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు నాగరాజు, నియోజకవర్గ నాయకులు ఎల్లప్ప, జిల్లా నాయకులు శంకరప్ప, మండల నాయకులు నాగభూషణం శాంతిపురం మండల ఇన్చార్జ్ మంజునాథ్,బాస్ నాయకులు రవికుమార్,అబుకల దొడ్డి పంచాయతీ నాయకులు సింహాద్రి, గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

### గ్రేస్ మేరియా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్
## ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**



కుప్పంని యోజకవర్గం శాంతిపురం మండలం దండికుప్పం పాఠశాలలో గ్రేస్ మేరియా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6వతరగతిలో చేరిన విద్యార్థులకు చదివే 5సంవత్సరంలో వాళ్ళు చెట్లను పెంచాలి అనే ఉద్దేశంతో ట్రస్ట్ నిర్వాహకులు అందించడం జరిగింది. మొత్తం పాఠశాలలో ఉన్నవిద్యార్థులకు మొక్కలను అందించి నేటి మొక్కలే- రేపటి వృక్షాలు అనే ఉన్నదేశంతో మొక్కలు అందించారు. ఈ కార్యక్రమలో పాఠశాల సిబ్బంది చందనమ్మ, అలాగే ట్రస్ట్ సిబ్బంది ఆరోక్య రాజ్,జేసుమేరీ పాల్గొన్నారు.

## విద్యామిత్రకిట్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి జేఎంసి మురళి బీసీ సెల్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీ ఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కుప్పంనియోజకవర్గంలో జరుగుతున్న విద్యార్థి మిత్రకిట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కుప్పం మండలం ములకలపల్లి గ్రామంలోని ప్రభుత్వపాఠశాలలో కమిటీ అధ్యక్షులు కనకరాజు రమేష్‌తో కలిసి కుప్పంనియోజకవర్గ టిడిపి జేఎంసి మురళి బీసీ సెల్ అధ్యక్షులు ప్రధానో పాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందంతదితరులు విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు.

## విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 25:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్రశేఖర్ సూచనల మేరకు కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న విద్యాకిట్లపంపిణీ కార్యక్రమంలో భాగంగా కుప్పం పట్టణం కొత్తపేట ప్రభుత్వపాఠశాల లో కమిటీ అధ్యక్షురాలు రోజా మదన్ తో కుప్ప కొత్తపేట మోడల్ ప్రైమరీ స్కూల్లో బుధవారంరోజు విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను స్కూల్ హెడ్మాస్టర్, టీచర్ ఆధ్వర్యంలో కొత్తపేట ఇంచార్జ్ అప్పు (ముకేశ్) కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 13వ కౌన్సిలర్ హంస సోమశేఖర్, 13,14 వార్డ్ అధ్యక్షులు మురళి, లోకేష్, సీనియర్ నాయకులు, అన్సర్ బాషా, వరదరాజులు, మహేంద్ర, కృష్ణన్ నాటర్, తిరుమగళ్ మునెప్ప టిఎన్ఎస్ఎఫ్, మురళి, మోహన్, భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణప్ప, ఉపాధ్యాయ బృందం తదితరులు విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు.

# దిగివస్తున్న బంగారం ధరలు!



బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టంలో ట్రేడ్ అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా.. తులం పసిడి ధర లక్ష మార్కు దాటి పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే బంగారం ధర రెండు రోజుల నుంచి దిగివస్తూ కాస్త ఊరటనిస్తోంది. కాగా.. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అటు వెండి ధరలు కూడా గరిష్ట స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి. అయితే.. బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది.. వీటి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. జూన్ 25 2025 బుధవారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.99,210 ఉండగా.. 22 క్యారెట్ల ధర 90,940 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,08,900లుగా ఉంది. బంగారం తులంపై రూ.10, వెండి కిలోపై రూ.100 మేర ధర తగ్గింది. అయితే.. ఈ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,210 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,940 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,18,900లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,210 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.90,940లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,18,900 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,360, 22 క్యారెట్ల ధర రూ.91,090 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,08,900లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.99,210, 22 క్యారెట్ల ధర రూ.90,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,08,900లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.99,210 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.90,940 లుగా ఉంది. వెండి ధర కిలో రూ.1,18,900 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.99,210, 22 క్యారెట్ల ధర రూ.90,940 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,08,900 లుగా ఉంది.

# తొలి టెస్ట్‌లో హిట్.. రెండో టెస్ట్‌లో ఫట్



కొలొంబో వేదికగా శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య ఇవాళ (జూన్ 25) రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ షద్మాన్ ఇస్లాం (46), మొమినుల్ హక్ (21), ముష్ఫికర్ రహీం (35), లిటన్ దాస్ (34), మెహిది హసన్ మిరాజ్ (31), నయీమ్ హసన్ (25) రెండంకెల స్కోర్లు చేయగా.. అనాముల్ హక్ 0, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో 8 పరుగులకు ఔటయ్యారు. ఆట ముగిసే సమయానికి తైజుల్ ఇస్లాం (9), ఎబాదత్ హొసేన్ (5) క్రీజ్‌లో ఉన్నారు. బంగ్లా ఇన్నింగ్స్‌ను అశిత ఫెర్నాండో (14-2-43-2), విశ్వ ఫెర్నాండో (16-3-35-2), సోనల్ దినుష (9-3-22-2), ధనంజయ డిసిల్వ (5-0-15-1), తిరందు రత్నాయకే (16-1-63-1) దెబ్బకొట్టారు. కాగా, రెండు టెస్ట్‌లు, మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ డ్రాగా ముగిసింది. ఆ మ్యాచ్‌లో ఇరు జట్లు ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఇరు జట్ల తరఫున నాలుగు సెంచరీలు నమోదయ్యాయి. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో రెండు ఇన్నింగ్స్‌ల్లో (148, 125 నాటౌట్) సెంచరీలు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో బంగ్లా బ్యాటర్ ముష్ఫికర్ రహీం (163), శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సంక (187) సెంచరీలు చేశారు.

**తొలి టెస్ట్‌లో హిట్.. రెండో టెస్ట్‌లో ఫట్**
తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసి అదరగొట్టాడు. అయితే ఇవాళ ప్రారంభమైన రెండో టెస్ట్‌లో మాత్రం 8 పరుగులకే ఔటయ్యాడు. తొలి టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసిన ముష్ఫికర్.. రెండో టెస్ట్‌లో ఓ మోస్తరు స్కోర్ (35) చేసి ఔటయ్యాడు. తొలి టెస్ట్‌లో ట్విన్ సెంచరీలు చేసి హిట్ అయిన నజ్ముల్ హసన్.. రెండో టెస్ట్‌లో సింగిల్ డిజిట్ స్కోర్‌కే ఔటై ఫట్ అనిపించాడు.

# చెత్త రికార్డ్ సొంతం చేసుకున్న శుభ్‌మన్ గిల్!

**ఇంటర్నెట్ డెస్క్:** లీడ్స్‌లో టీమ్‌ఇండియాకు ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్ ద్వారా శుభ్‌మన్ గిల్ తన కెప్టెన్సీ ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటర్‌గా రాణించినప్పటికీ.. కెప్టెన్‌గా తన టీమ్‌ను మాత్రం గెలుపు బాట పట్టించలేకపోయాడు. బుమ్రా మినహా మిగతా బౌలర్లు తేలిపోవడం, ఆఖరి ఇన్నింగ్స్‌లో బెన్ డకెట్ అద్భుత సెంచరీ (149) సాధించడంతో.. టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ చేతిలో అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇలా గిల్ కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసినా, భారత జట్టు మాత్రం ఓటమి చవిచూడాల్సి వచ్చింది.దీంతో శుభ్‌మన్ గిల్ ఈ విషయంలో.. దిలీప్ వెంగ్‌సర్కార్ విరాట్ కోహ్లీ సరసన నిలిచాడు. 1987లో అరుణ్‌జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్‌తో టీమ్‌ఇండియా ఆడిన మ్యాచ్‌కు వెంగ్‌సర్కార్ సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్‌గా అతడికి అదే మొదటి మ్యాచ్. ఆ మ్యాచ్‌లో అతడు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (102) సాధించాడు. కానీ ఆ పోరులో టీమ్‌ఇండియా అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. 2014 డిసెంబర్‌లో అడిలైడ్ ఓవెల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియాకు మొదటిసారిగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించాడు. ఆ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు బాదాడు. కానీ టీమ్‌ఇండియా ఆసీస్ చేతిలో 48 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తాజాగా ఈ జాబితాలో టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా చేరి, ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.



## స్పోర్ట్స్

## గౌతమ్ గంభీర్‌పై విమర్శల వర్షం



టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ గతేడాది టీ20 వరల్డ్‌కప్ తర్వాత (2024, జూన్) బాధ్యతలు చేపట్టాడు. రాహుల్ ద్రవిడ్ నుంచి గంభీర్ బాధ్యతలు స్వీకరించాడు. ద్రవిడ్ ఆధ్వర్యంలో భారత్ టీ20 వరల్డ్ ఛాంపియన్‌గా అవతరించింది. ద్రవిడ్ వారసుడిగా అప్పటికే కేకేఆర్‌కు ఐపీఎల్ టైటిల్ (మెంటార్) అందించిన గంభీర్ రావడంతో టీమిండియాపై అంచనాలు భారీగా పెరిగాయి. మూడు ఫార్మాట్లలో భారత్‌కు తిరుగుండదని అందరూ భావించారు. అయితే అంచనాలు తారుమారయ్యాయి. గంభీర్ ఆధ్వర్యంలో టీమిండియా టెస్ట్‌ల్లో దారుణంగా విఫలమవుతూ వస్తుంది. టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్ రెండు వరుస విజయాలతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. తొలి రెండు విజయాలు బంగ్లాదేశ్‌పై సాధించినవి కావడంతో వాటికి అంత ప్రాముఖ్యత దక్కలేదు. అయితే గంభీర్‌కు అసలు పరీక్ష మూడో టెస్ట్ నుంచి మొదలైంది. భారత్ స్వదేశంలో ఇంగ్లండ్ చేతిలో వరుసగా మూడు టెస్ట్‌ల్లో ఓడింది. ఇక్కడి నుంచే గంభీర్‌పై విమర్శలు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఆస్ట్రేలియాను ఓడించడంతో గంభీర్ విజయ ప్రస్తానం మొదలైందని అంతా అనుకున్నారు. అయితే గంభీర్ విజయ పరంపర కేవలం ఆ ఒక్క మ్యాచ్‌కే పరిమితమైంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మూడో టెస్ట్ డ్రా కాగా.. నాలుగు, ఐదు మ్యాచ్‌ల్లో టీమిండియా వరుసగా పరాజయాలు చవిచూసింది. తాజాగా ఇంగ్లండ్ చేతిలో ఓటమితో భారత్ గంభీర్ ఆధ్వర్యంలో హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా ఉండగా.. భారత్ 11 టెస్ట్ మ్యాచ్‌ల్లో కేవలం? మూడే విజయాలు సాధించింది. ఒకటి డ్రా చేసుకొని, ఏకంగా ఏడింట పరాజయాలు ఎదుర్కొంది. వరుస వైఫల్యాల నేపథ్యంలో గంభీర్‌పై విమర్శలు ధాటి బాగా పెరిగింది. ద్రవిడ్ హయాంలో వరుస విజయాలతో దూసుకుపోయిన టీమిండియా.. గంభీర్ వచ్చాక అదఃపాతాళానికి పడిపోయిందని భారత క్రికెట్ అభిమానులే అంటున్నారు. గంభీర్ వచ్చాక టీమిండియాలో రాజకీయాలు ఎక్కువయ్యాయని, అందుకే ఈ పరాజయాలు పరంపర అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. గంభీర్ తన తీరును మార్చుకోకపోతే టీమిండియా ఇంగ్లండ్‌లో వైట్‌వాష్ తప్పదని జోస్యం చెబుతున్నారు. గంభీర్ రాజకీయాలు మాని జట్టును గెలుపు బాట పట్టించడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. గంభీర్ ఇదే ధోరణిని కొనసాగిస్తే.. భారత్‌కు టెస్ట్ క్రికెట్ చరిత్రలో అతి పెద్ద పరాజయాలు పరంపర తప్పదని హెచ్చరిస్తున్నారు. 1967-68లో భారత్ వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొంది. ఇప్పటికే హ్యాట్రిక్ పరాజయాలు ఎదుర్కొన్న భారత్.. ఇంగ్లండ్ చేతిలో వైట్ వాష్ అయితే ఆ రికార్డును సమం చేస్తుంది. ప్రస్తుతం టీమిండియా గంభీర్ ఆధ్వర్యంలో గత 9 మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించి, మరో అపవాదును మూటగట్టుకుంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143